క్లుప్తంగా

అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలి

మైదుకూరు(చాపాడు) : ఖరీఫ్ సీజన్ ఇప్పటికే మొదలుకావడంతో రైతులందరూ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారని ఈ క్రమంలో ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలుచేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ తెలిపారు. మైదుకూరులో బుధవారం రైతులతో, నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వే లు చొప్పున అన్నదాత సుఖీభవ అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చాడన్నారు. రెండో సంవత్సరం జరుగుతున్నప్పటికీ ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ ఇప్పటి వరకూ చెప్పకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రైతులు తమ హామీ అమలు కోసం రాజకీయాల కతీతంగా ఏకమై ప్రభుత్వాన్ని ప్రశ్నించి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



ఉచిత దుస్తులతో విద్యార్థులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎఫ్‌సీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు బుధవారం మండలంలోని 578 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. గానుగపెంట, సిద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కృష్ణంపల్లె, వెంకట్రామాపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి దుస్తులు అందచేశారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్ శివలక్ష్మి, నాగేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు గ్రామ సచివాలయ పరిధిలో ఇటీవల బదిలీపై వెళ్లిన గ్రామ సచివాలయ ఉద్యోగులకు బుధవారం సచివాలయంలో సన్మాన వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. బదిలీపై వెళ్లిన మహిళా పోలీసు గురుజ్యోతి, సర్వేయర్ ముఖేష్, డిజిటల్ అసిస్టెంట్ యోగానందరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్, ఏఎన్ఎం మేరీలకు సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి, వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు నాగేంద్రారెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

వరిసాగులో విత్తన శుద్ధి తప్పనిసరి

చాపాడు : ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసుకునే రైతులు నారుమడుల సాగులో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి దేవిపద్మలత తెలిపారు. మండలంలోని కుచ్చుపాప, అనంతపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి సాగులో విత్తన శుద్ధి చేపట్టడం వలన పంట పెరుగుదల బాగుంటుందని, పైరు చీడ పీడలను తట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

27న మండల సమావేశం

గోపవరం : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ ఉదయం 10-30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. అధికారులు తప్పకుండా తమ నివేదికలతో హాజరు కావాలన్నారు.

నివాళి

పోరుమామిళ్ల : స్థానిక రెడ్డినగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, వాస్తుపండితుడు గురివిరెడ్డి మంగళవారం సాయంత్రం మృతి చెందారు. సమాచారం తెలిసిన రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి దంపతులు బుధవారం ఆయన మృతదేహం సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా విద్యాబోధనలో మంచి పేరు తెచ్చుకుని, ఇటీవల రెండు మోకాళ్లకు ఆపరేషన్ చేయించుకొని వచ్చారని, అంతలోనే గుండెపోటుతో మృతి చెందడం బాధాకరంగా ఉందన్నారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవాలు



సుబ్బిరెడ్డి కొట్టాల్లో విద్యుత్ దీపాలంకరణలో చౌడేశ్వరిదేవి ఆలయం



చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్

ప్రొద్దుటూరు కల్చరల్ : అమ్మలగన్న అమ్మ శ్రీ చౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు చౌడేశ్వరి దేవి ఆలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. రామేశ్వరం, వసంతపేట, వినాయక నగర్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, పప్పుల బజార్‌రోడ్డు, విజయనగరం వీధి, ధర్మల్ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరి, సుబ్బిరెడ్డి కొట్టాలు, మేదర వీధిలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయాలతో పాటు పలు చౌడేశ్వరి దేవి ఆలయాలల్లో అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. అలాగే మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా బారీకేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని ఆలయాల నిర్వాహకులు సాయంత్రం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తిని ఘనంగా ఊరేగించనున్నారు.

కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ఉచిత శిక్షణ



ఉచిత కోచింగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్ని కాంపిటీటివ్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో బుధవారం ఉచిత కోచింగ్‌కు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ సీజీఎల్ 14,582 పోస్టులు, సీహెచ్ఎస్ఎల్ 3131 పోస్టులు, ఎంటీఎస్ 1075 పోస్టులకు నోటిఫికేషన్ వెలువడ్డాయన్నారు. అలాగే ఏపీ హైకోర్టు 1621 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ బరోడా 500 పోస్టులు, ఆర్ఆర్‌బీ గ్రూప్ డీ 32,438 పోస్టులు, ఏఎల్‌పీ 11,558 పోస్టులు, ఐబీపీఎస్ పీఓ 5208 పోస్టులు ఉన్నాయని వివరించారు. ఈ ఉద్యోగాలకు సంబధించి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోచింగ్‌కు రాదలచిన వారు 9705333305 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోచింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, హరీష్, రామేశ్వరి, హైమావతి, బాలనరసింహులు, యశ్వంత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను జైలుకు పంపేందుకే చార్జ్‌షీట్‌లో పేరు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం



ఖాజీపేట : రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మాజీ సీఎం వైఎస్ జగన్ పై కుట్రపూరితంగా మద్యం కేసులో పేరు పెట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ సక్రమంగా జరిగిందన్నారు. ఎలాంటి అక్రమాలు జరగనప్పటికీ ఎదో విధంగా మాజీ సీఎం జగన్‌ను కూటమి ప్రభుత్వం జైలుకు పంపాలన్న కక్షతోనే చార్జీషీట్‌లో మూడు చోట్ల పేరు నమోదు చేయడం జరిగిందన్నారు. దీన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ ఖండించాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చే హామీలు ఆచరణ కానీ హామీలని జగన్ ఎన్నికల ముందే చెప్పారన్నారు. ప్రజలకు వాగ్ధానం చేసేటప్పుడు కూటమి ప్రభుత్వంకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వంకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్లాస్టిక్ నిరోధానికి కలిసికట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల నిరోధానికి ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందు కోసం ప్రతి సచివాలయంలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్లాస్టిక్ నిరోధం ద్వారానే పారిశుధ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మురుగు కాలువలు సక్రమంగా ప్రవహించడం లేదని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువుల అమ్మకాలపై జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో కడప పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి టి.సునీల్‌కుమార్, సచివాలయ కార్యదర్శులు నల్లం శివకరుణశ్రీ, ఎస్.శ్రీనివాసులరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించండి



రైతులకు వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (జేడీఏ) చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతులు మిశ్రమ ఎరువుల్లో యూరియాను కలపకూడదన్నారు. జీవామృత ఎరువులను ఉపయోగిస్తే భూమి ఆరోగ్యం పదిలంగా ఉండటంతోపాటు రైతుకు సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడి పొందవచ్చునన్నారు. అనంతరం ప్రభుత్వ వ్యవసాయ శాఖ, జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా ప్రొద్దుటూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు వీ6 రకం వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. 102 మంది రైతులకు 510 బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఏడీఏ అనిత, కడప డీఆర్‌సీ కేంద్రం ఏడీఏ అశోక్, ఏఓ వరహరికుమార్, సుస్థిర వ్యవసాయ కేంద్ర స్టేట్ కో-ఆర్డినేటర్ ఆదినారాయణ, ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కమిటీ లిమిటెడ్ సీఈఓ పవన్, టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలోని రామాలయం పక్కనే ఉన్న కల్లంలో గురువారం సాయంత్రం 3 గంటలకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాణా వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి రానున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లెలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, బీటీఎం శ్రీనివాసులు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసే వరి, మినుము, ఉల్లి, కంది పంటలలో చీడపీడలు, వాటి యాజమాన్యం గురించి వివరించారు. మినుము, కంది విత్తనాల మినీ కిట్స్‌లను రైతులకు అందించారు. జీవామృతం, కషాయాలను రైతులు వినియోగించడం వల్ల పెట్టుబడులు తగ్గుతాయన్నారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఉల్లి పంటలో నారుమడి యాజమాన్యం, పంటలో వచ్చే కుళ్లు తెగులు, నులిపురుగుల నివారణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ సింగరయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీలక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ చేయించుకోవాలి

కాశినాయన : రైతులు సాగు చేసిన పంటకు ఇ-క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్, ఏఈఓ రవి తెలిపారు. బుధవారం ఇటుకలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంటలను ఈ-క్రాప్ చేయించుకుంటే భవిష్యత్తులో ప్రకృతి విపత్తులు, పంట ఇన్సూరెన్స్ పొందేందుకు ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. పంటలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సూక్ష్మ పోషకాలైన సల్ఫేట్, క్యాల్షియం , బోరాన్, ఐరన్, జింక్ వంటి పోషకాలను పంటలకు అందించాలని సూచించారు.

తహసీల్దారుకు ఫిర్యాదు

చాపాడు : మండలంలోని నరహరిపురం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి నుంచి కుందూనది వెళ్లే దారిలో పంట పొలాలకు వెళ్లేదారిని కొంత మంది చెడగొట్టి పూడ్చివేశారని బుధవారం పలువురు రైతులు తహసీల్దారు రమాకుమారి ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి ముగ్గురు రైతులు జేసీబీతో పొలాల్లోకి వెళ్లేదారిని పూర్తిగా ధ్వంసం చేశారని దీనిపై అధికారులు స్పందించి పంట పొలాలకు దారిని తిరిగి ఏర్పాటు చేయాలని తహసీల్దారును కోరారు. తహసీల్దారు మాట్లాడుతూ.. రైతులు తమ పట్టా భూములలో ఎలాంటి రస్తా లేదని, తమ పొలాల్లో ఇతరులు వెళ్లేందుకు అవకాశం లేదని దీనికి సంబంధించి కోర్టు నుంచి ఉత్తర్వులు కూడా తీసుకువచ్చారని, దీనిపై పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నోటుపుస్తకాలు వితరణ

పోరుమామిళ్ల : రామేశ్వరం మోడల్ ప్రైమరీ స్కూలు విద్యార్థులకు బుధవారం బత్తుల లేక్షణ పుట్టినరోజు సందర్భంగా 65 మందికి నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. రామేశ్వరం గ్రామానికి చెందిన బత్తుల రవి సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. రవి కూతురు లేక్షణ పుట్టిన రోజు సందర్భంగా రవి సతీమణి మంజుల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు బ్రహ్మారావు, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాతా శిశు సేవలపై నిర్లక్ష్యం చూపొద్దు

ప్రొద్దుటూరు క్రైం : మాతా శిశువులకు అందించే సేవల్లో ఎక్కడా నిర్లక్ష్యం చూపొద్దని డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్ తెలిపారు. పట్టణంలోని శ్రీరాములపేటలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాతా శిశు సేవల ఆన్‌లైన్‌లో నమోదు, వారికి అందిస్తున్న సేవల రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్ఓ రమేష్‌రెడ్డి, డిప్యూటీ ఎస్ఓ హరినాథ్, డీపీఓ నారాయణ, రాజశేఖర్, పీహెచ్ఎన్ శాంతిలత, డాక్టర్ భరత్‌నారాయణ, డీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సన్మానం

ఖాజీపేట : మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర శిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డిని బుధవారం ప్రొద్దుటూరులోని ఆయన ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన రెడ్యం తన సోదరులతో పాటు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి తన పదవికి కారకులైన మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, పీవీ రాఘవరెడ్డి, డీఎల్ శ్రీనివాసులరెడ్డి, బత్తల సుబ్బరాయుడు, సిద్దారెడ్డి, మల్లె ఓబయ్య, ముత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషా

అట్లూరు : విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాషా, మండల కార్యదర్శి ఇ.రమణయ్యలు తెలిపారు. బుధవారం అట్లూరు క్రాస్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్‌మీటర్లు అదానీకి వరం, రాష్ట్ర ప్రజలకు పెనుభారంగా మారనుందన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేష్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగులకొట్టండి అని ప్రజలకు పిలుపునిచ్చారని, నేడు అధికారంలోకి రాగానే దగ్గరుండి స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని, ఇది చాలా దుర్మార్గమన్నారు. మండలంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే సీపీఎం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. సమావేశంలో మహిళా సంఘం నాయకురాళ్ళు దుర్గమ్మ, స్వప్న, లత, వృత్తిదారుల సంఘం నాయకులు రవిచంద్ర, వడ్డెర సంఘం నాయకులు గంగయ్య, వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కొండయ్య, శివకుమార్, రవి, సిద్దయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ స్ఫూర్తితో కడప ఉక్కు సాధనకు పోరాటాలు



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే అమరుడైన యోధుడు చంద్రశేఖర్ అజాద్ స్ఫూర్తితో కడప ఉక్కు సాధనకు పోరాటాలు కొనసాగిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక బీజేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అజాద్ పాత్ర చిరస్మరణీయమని, అయితే పాలకులు మాత్రం దేశం కోసం అమరులైన త్యాగధనులను గుర్తించడం లేదన్నారు. నేటి యువత చంద్రశేఖర్ ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకుని కడప ఉక్కు కోసం పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోండి



సబ్‌జైలులో రిజిస్టర్లు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

బద్వేలు అర్బన్ : సబ్‌జైలులో అవసరమైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును బుధవారం సందర్శించిన ఆయన జైలు పరిసరాలను, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్ జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు కొంగుబంగారం పట్టాభిరాముడు

పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెలలో వెలసిన జనమేజయ ప్రతిష్ఠితమైన పట్టాభిరాముడు భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్నారని నెల్లూరుకు చెందిన సాహితీవేత్త, అష్టావధాని, ఆత్రేయ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్. జనార్ధనరావు పేర్కొన్నారు. బుధవారం చల్లగిరిగెల రామాలయంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విద్వాన్ గానుగపెంట హనుమంతారావు ఆలయానికి సంబంధించిన విశేషాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని జనార్ధనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్ధనరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయఅర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపటి నుంచి వెల్లాలలో శ్రావణ మాస పూజలు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శుక్రవారం నుంచి శ్రావణ మాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ మాసంలో ముఖ్యంగా 26, ఆగస్టు 2, 9, 16, 23 తేదీల్లో శనివారం రోజున శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు చేయనున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి, శ్రీచెన్నకేశవ సంజీవరాయ స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేసి ఊరేగించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డిలు తెలిపారు. ఆ రోజుల్లో స్వాముల వారిని దర్శించుకొని పూజలు చేస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అలాగే వచ్చే నెల 8వ తేదీన శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి, అమ్మవార్లకు రోజూ విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. రోజూ సాయంత్రం 6 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారని, అలాగే 8వ తేదీన ఉదయం 10 గంటలకు వరలక్ష్మీ వ్రతం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.



అలంకరణలో సంజీవరాయ స్వామి